అతనికి మొదటిసారి విమానం ఎక్కే అవకాశం వచ్చింది. ఎన్నో ఊహలతో ప్రయాణానికి బయలుదేరిన అతన్ని వాస్తవం ఎలా పలుకరించింది?

# విమానయానం

స్వాతి వార పత్రికలో ప్రచురింపబడిన కథ

పుట్టగంటి గోపీకృష్ణ

# విమానయానం



తను ఉండే ఇంటి మీదగానే వందలాది విమానాలు రోజూ ఎగురుతున్నా, తను విమానంలో ప్రయాణిస్తానని సుబ్బారావు ఎప్పుడూ అనుకోలేదు.

ఈ మధ్య మార్చిన ప్రభుత్వ పాలసీ అతనికి 'ఎలిజిబిలిటీ' ప్రసాదిస్తే, ఢిల్లీలో ఏర్పాటయిన ట్రైనింగ్ అవసరాన్ని కల్పించింది.

"పార్టీ ఎప్పుడు గురూ..." అంటున్న సహచరవర్గాన్ని టీ, సమోసాలతో తృప్తి పరచి ఆఫీసులో తీసుకున్న అడ్వాన్సుతో ఆన్‌లైన్ బుకింగ్ సెంటర్ వైపు నడిచాడు.

అనుకూలంగా ఉంటుందనుకున్న ఒక విమానాన్ని సెలక్ట్ చేసుకుని బుకింగ్ కన్ఫర్మ్ చెయ్యమన్నాడు.

"ఇన్స్యూరెన్స్ కలపమంటారా? వద్దా?..." అని అడిగిన ఎదుటి వ్యక్తి ప్రశ్నతో ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు. "ఇన్స్యూరెన్స్ ఏంటి?" అయోమయంగా అడిగాడు.



"ఎంత సార్ వంద రూపాయిలే! ఒక వేళ మీ సామాను పోయినా, ఫ్లైటు క్యాన్సిల్ అయినా, మీకు అనారోగ్యం వచ్చినా పనికి వస్తుంది..." అన్నాడు వాడు.

"అంటే అవన్నీ జరిగే అవకాశాలు ఉన్నాయా?" వేస్తున్న విజిల్ ఆగిపోగా ఆందోళనగా అడిగాడు సుబ్బారావు.

"వద్దంటే మీ ఇష్టం. ఈ విషయానికి అంత హర్ట్ అవ్వాల్సిన అవసరం లేదు..." సుబ్బారావు హావభావాలు చూసిన ఏజంటు అనునయంగా చెప్పాడు.

సుబ్బారావు రకరకాలుగా ఆలోచించుకుని క్షమాభిక్ష అడగటానికి నిరాకరించి ఉరికంబం ఎక్కిన భగత్‌సింగులా



ఎట్టకేలకు ప్రయాణం కొనసాగించటానికే నిర్ణయించుకున్నాడు. "ఇన్సూరెన్స్ వద్దు. మామూలు టికెట్ బుక్ చెయ్యి..." అన్నాడు ఎట్టకేలకు.

టికెట్ చేతబట్టుకుని సుబ్బారావు ఇంటికి వచ్చేటప్పటికి బిలబిలమంటూ ఇంట్లో నుండి పది మందికి పైగా అమ్మలక్కలు బయటకు వెళ్తూ కనిపించారు. అందరి చేతుల్లో ఫలం, పత్రం, జాకెట్ గుడ్డా కనిపించాయి.

ఏం జరుగుతుందో భార్యని అడుగుదామంటే ఆమె మిగిలిన అమ్మలక్కల అభినందనలతో తడిసి ముద్దవుతూ అతన్ని పట్టించుకోలేదు.

టి.వి.చూస్తున్న పండుగాడిని పక్కకి పిలిచి, "ఏంట్రా? ఈ హడావుడి?" అని అడిగాడు.

"నువ్వు విమానం ఎక్కుతున్నావంటగా... అందుకు." అని ఇంతలో వాడి చిట్టి బుర్రలో ఏం ఆలోచన వచ్చిందో కానీ, "నాన్నోయ్..." అని గావు కేక పెట్టాడు.

"ఏంట్రా ఆ అరుపు. విమానం ఎక్కకముందే పైకి పంపేలా ఉన్నావ్..." అంటూ విసుక్కున్నాడు సుబ్బారావు.

"విమానం మన ఇంటి మీదగానే వెళ్తుందిగా, నేను డాబా మీద నిలబడి 'టాటా' చెప్తాను. నేను కనిపించానో లేదో చెప్పాలి..." అన్నాడు పండుగాడు. వాడికదో ఆనందం. రోజూ డాభా మీద నిలబడి విమానాలకు టాటా చెప్తాడు.

ఇంతలో అతని భార్య అమ్మలక్కలకి సెండాఫ్ ఇచ్చి వచ్చింది.

"మరీ ఎక్కువ హడావుడి చేస్తున్నావేమో?" గంభీరంగా అన్నాడు సుబ్బారావు.





"దిష్టి తగలకుండా ఉండాలంటే ఆమాత్రం హడావుడి చెయ్యక తప్పదులేండి..." ఆరాధనగా అంది ఆమె.

అంతకు ముందు విమాన ప్రయాణం చేసిన సూరిపండు దగ్గర ప్రయాణంలో జాగ్రత్తల గురించి ఒకటి రెండు టిప్స్ కూడా తీసుకున్నాడు సుబ్బారావు. ప్రయాణం రోజు ఎప్పుడు వచ్చిందో కూడా తెలియనంత వేగంగా వచ్చేసింది. తెల్లవారుజామున నాలుగు గంటలకి బయలుదేరితే కానీ ఎయిర్‌పోర్టుకు చేరలేడు. ఆఫీసు వాళ్ళు ఫ్లైట్ టికెట్ ఖర్చు ఇస్తారు కానీ టాక్సీ ఖర్చులు ఇస్తారో లేదో అనుమానమే! కాబట్టి కాల్ టాక్సీ బుక్ చెయ్యకుండా, బస్సులో బయలుదేరాడు.

వీర తిలకం దిద్దిలేదు కానీ, బొట్టు పెట్టి సెండాఫ్ ఇచ్చింది అతని భార్య. "నాన్నోయ్ నేను డాబా మీదే ఉంటాను..." గుర్తు చేశాడు పండుగాడు.

ఎయిర్‌పోర్టు బస్సు దిగి, డిపార్చర్ గేటు దగ్గరకు నడుస్తుంటే అక్కడ ఏదో ఒక ఐడెంటిటీ కార్డ్ చూపించాలన్న సూరిపండు హెచ్చరిక గుర్తొచ్చింది.



తన పాన్ కార్డ్ తీసి అక్కడ ఉన్న గార్డుకు ఇచ్చాడు సుబ్బారావు.

"ఎవడిదో ఇస్తావేందయ్యా! నీది చూపించు..." అన్నాడు వాడు.

"అది నాదే..." దాని మీద పాతికేళ్ల క్రితంనాటి తన ఫొటోని చూస్తూ మురిపెంగా అన్నాడు సుబ్బారావు.



"నేనేమన్నా పాగల్‌గాడిలా కనిపిస్తున్నానా? ఎవడైనా ఒక్కడి చేత ఇది నీ ఫొటో అనిపించు. నిన్ను లోపలకు పంపుతాను..." అని సుబ్బారావుని పక్కన నిలబెట్టేశాడు ఆ గార్డు.

ఒకసారి అక్కడ ఉన్న అద్దాలలో తనను తాను చూసుకున్నాక గార్డు తనని గుర్తు పట్టక పోవటంలో తప్పేమీ లేదని సుబ్బారావుకి అర్ధమయింది. అప్పటి గిరజాల జుట్టు ఇప్పుడు గుండులా మారి పోయింది. బక్కగా ఉన్న అప్పటి తను ఇప్పుడు గుండ్రంగా మారాడు.

అయోమయం చూపులతో గార్డు పక్కన నిలబడిపోయిన సుబ్బారావుని పట్టించుకోకుండా ఎవరిదారిన వాళ్లు లోపలకి వెళ్లి పోతున్నారు. తనని గుర్తించమన్న సుబ్బారావు అభ్యర్ధనని ఎవరూ పట్టించుకోలేదు.

ఎట్టకేలకు ఆ గార్డే జాలి తలచి, "ఈసారి లేటెస్ట్ కార్డ్ తెచ్చుకో..." అని వార్నింగ్ ఇచ్చి లోపలకి వదిలాడు.

బ్రతుకు జీవుడా అనుకుంటూ సూరిపండు చెప్పిన రెండో సూచన గుర్తుకు తెచ్చుకుని తన విమాన కంపెనీ కౌంటర్ వైపు నడిచాడు సుబ్బారావు.

కిటికి పక్క సీటు సంపాదించాలన్నది అతని ధ్యేయం. చిన్నప్పుడు రైలు ఎక్కినా, బస్సు ఎక్కినా కిటికీ పక్క సీటు కోసం ఎంత ఆరాట పడేవాడో! ఏ సీట్లో కూర్చోవాలన్నది ఈ కౌంటర్ దగ్గరే డిసైడవుతుందనీ, కిటికీలో నుండి కర్చీఫులు వెయ్యటం ఇక్కడ కుదరదనీ సూరిపండు ముందే చెప్పి ఉంచాడు. కానీ ఆ కౌంటర్ వెనుక ఉన్న అమ్మాయిని ఈ వయసులో కిటికీ సీటు కావాలని అడగాలంటే



సిగ్గనిపించింది. ఎట్టకేలకు గొంతు పెగల్చుకుని వెనుక నిలబడ్డ వాడికి వినిపించకుండా, "విండో సీటు..." అని గొణిగాడు.

"లాస్టు రోలో ఉంది. పరవాలేదా?" అడిగింది ఆ అమ్మాయి.

బస్సులోలా విమానంలో కూడా వెనుక సీటు ఎత్తెత్తి వేస్తుందేమో అని ఒక అనుమానం వచ్చింది కానీ గాలిలో ఎగిరేదానికి కుదుపులెలా ఉంటాయన్న కామన్ సెన్సు దాన్ని కొట్టేసింది. "ఓ.కె..." అన్నాడు వినీ వినపించనట్లు.

"బ్యాగేజ్ ఉందా?"

తన బ్యాగ్ చూపించాడు సుబ్బారావు.

"దానిని బుక్ చేయనవసరం లేదు. హ్యాండ్ బ్యాగేజ్ కింద మీతో తీసుకుళ్లండి."

తరువాత ఏమి చెయ్యాలని సూరిపండు చెప్పాడో గుర్తు రాలేదు సుబ్బారావుకి. తన ముందు ఉన్న వ్యక్తి ఏం చేస్తే అది చెయ్యాలని డిసైడయ్యి అతన్ని అనుసరంచటం మొదలు పెట్టాడు.

అతను ఒక ఎలివేటర్ ఎక్కి, మరో లిఫ్టు దిగి ఎట్టకేలకు ఒక తలుపు తీసుకుని గదిలోకి వెళ్లటం గమనించి తను కూడా అందులోకి దూరి అది టాయిలెట్ అని గమనించి ఆ తరువాత ఏం చెయ్యాలో తెలియక ఆగిపోయాడు.



అతని దురవస్థ ఎలా తెలిసిందో కానీ టాయిలెట్ క్లీన్ చేసే వ్యక్తి పలుకరించాడు.

తన బాధ చెప్పుకున్నాడు సుబ్బారావు.

అతను సుబ్బారావు చేతిలోని బోర్డింగ్ పాస్ చూసి, తరువాత స్టెప్ వివరించి, సెక్యూరిటీ చెక్ క్యూ చూపించి సాయం చేశాడు. మనుషుల్లో

మానవత్వం ఇంకా బ్రతికే ఉందని గుర్తించి అటు నడిచాడు సుబ్బారావు.

ఈసారి కాస్త ముందు జాగ్రత్త వహించి అందరూ ఏం చేస్తున్నారో రెండు నిమిషాలు గమనించి



అందరూ చేసినట్లే తన బెల్టూ, సెల్ ఫోనూ, చిల్లర డబ్బులతో సహా ఒక ప్లాస్టిక్ ట్రేలో పెట్టి, దానినీ బ్యాగునూ ఎక్సరే మెషీన్ వాడికి అప్పచెప్పి, తనను తాను ఒక పోలీసుకి అప్పచెప్పుకున్నాడు.

ఆ పోలీసు కితకితలు పెడుతూ వళ్లంతా తడుముతుంటే వద్దనుకున్నా నవ్వొచ్చింది చక్కిలిగింతలు ఎక్కువ ఉండే సుబ్బారావుకి.

ఆ నవ్వు చూసి అసలే ధుమధుమలాడుతున్న అ పోలీస్ మొహం మరింత ధుమధుమలాడింది.

మెటల్ డిటెక్టర్ సుబ్బారావు చుట్టూ దిష్టి తీస్తున్నట్లు తిప్పాడు పోలీస్. అది సుబ్బారావు నడుము దగ్గరకు రాగానే 'కుయ్...' అంది. తడిమి చూశాడు పోలీస్. ఏదో తగిలింది కానీ, అదేమిటో అతనికి అర్థం కాలేదు పోలీసుకి.

"లోపల ఏముంది? బెల్టు బాంబా?" అడిగాడు హిందీలో అతను.

"కాదు, తాయెత్తు..." తెలుగులో చెప్పాడు సుబ్బారావు. అతనికి హిందీ రాదు. ఇంగ్లీషు వచ్చినా తాయెత్తుని ఇంగ్లీషులో ఏమంటారో తెలియదు.

# విమానయానం

మొత్తానికి అతను చెప్పింది పోలీసుకు అర్థం కాలేదు. సుబ్బారావుని ఒక గదిలోకి తీసుకు వెళ్లి బట్టలు విప్పమన్నాడు. ఏం ఖర్మరా భగవంతుడా అనుకుంటూ పాంటు విప్పి, డ్రాయర్ కిందకి జరిపి తాయెత్తును చూపించాడు సుబ్బారావు.



జేబులోంచి కత్తెర తీసిన పోలీసు, సుబ్బారావు 'వద్దు, వద్దు...' అనే లోపే ఆ తాయెత్తుని కత్తిరించి డస్ట్ బిన్లో పడేశాడు. బామ్మ చిన్నప్పుడు కట్టిన తాయెత్తు ఇన్నేళ్ల తరువాత అలా పోవటం చాలా బాధనిపించినా విమానయానం కోసం తట్టుకు నిలబడ్డాడు సుబ్బారావు.

పోలీసు చెర నుండి బయటపడి బ్యాగు కోసం వెళ్తే దాని చుట్టూ ముగ్గురు పోగయి ఉన్నారు. సుబ్బారావును చూసి బ్యాగు తెరవమన్నారు. దాన్లో నుండి బయటకు తీసిన రేజర్లో బ్లేడునూ, సీసాలో నీటినీ బయట పారేసి మిగిలిన బ్యాగు అతనికి ఇచ్చారు.




'ఇదేదో డబ్బులిచ్చి విమానం ఎక్కుతున్నట్లు లేదు, యావజ్జీవ శిక్ష అనుభవించటానికి యరవాడ జైలుకి వచ్చినట్లు ఉంది...' అనుకుంటూ ముందుకు కదిలాడు సుబ్బారావు.

కళ్లు చెదిరేలా రకరకాల స్టాల్స్ కనిపిస్తున్నా ఒక పక్క టైము లేకా, మరో పక్క వాటి ధరలకి బెదిరీ వేటిలోకీ అడుగు పెట్టే ధైర్యం చెయ్యలేక పోయాడు అతను.

పరుగులు పెడుతూ బోర్డింగ్ పాస్ మీద సూచించిన గేట్ నెంబర్ దగ్గరకు వెళ్లేటప్పటికి అక్కడ ఎయిర్లైన్స్ సిబ్బంది ఇతగాడి కోసం వెదుకుతున్నారు.

"బోర్డింగ్ పాస్ తీసుకుని ఇంతసేపు ఎక్కడకి వెళ్లారు?" అని విసుక్కుంటూ అతన్ని ఒక సొరంగ మార్గం లోకి పంపారు. దాంట్లో కాస్త నడుస్తూ, మరికాస్త పరుగెడుతూ వెళ్లిన అతను సరాసరి విమానంలోకి ప్రవేశించాడు.



లోపల ప్రయాణికులందరూ తమ తమ సామాను సీటు పైన లాఫ్టుల్లో సర్దుకుంటూ హడావుడి పడుతున్నారు.

వాళ్లని తప్పించుకుంటూ, తోసుకుంటూ విమానం ఆఖరి వరుసలోని తన సీటు దగ్గరకు చేరుకునేటప్పటికి ఆయాసం వచ్చింది. మూడేసి సీట్లు కలిపి ఒక వరుసగా ఉన్నాయి. అక్కడ తన సీటేమో కిటికీ పక్కన. ఆ సీటుకు చేరుకోవాలంటే మరో ఇద్దరిని దాటుకుని వెళ్లాలి. సినిమాలలో చూపించినట్లు ఆ సీట్లు విశాలంగా కాళ్లు బార చాపుకునేలా లేవు. కూర్చున్నాక కదలటానికి కూడా వీలు కానట్లున్నాయి.

ఇతన్ని నిరసనగా చూస్తూ ఆల్రెడీ ఆ సీట్లలో కూర్చున్న వాళ్లు లేచి సుబ్బారావు తన సీటు దగ్గరకు వెళ్లే మార్గాన్ని సుగమం చేశారు. ఇతను కూర్చున్న తరువాత తిరిగి వాళ్లు కూర్చున్నారు.

మరీ ముఖ్యంగా సుబ్బారావు పక్కన... అంటే మూడు సీట్లలో మధ్య సీట్లో కూర్చున్న పంజాబీ సిక్కు కాస్త భారీ కాయం కలిగి ఉన్నాడు. విస్తరణ కాంక్షతో పక్క రాజ్యాల మీదకి దాడి చేసే రాజులా అతని శరీరం అతని సీటు పరిధి దాటి పక్క సీట్ల మీదకి వ్యాపిస్తోంది. అతని వీపు వెనుక సీటుకీ, పొట్ట ముందు సీటుకీ ఆనుకున్నాయి.

పైగా రెండు చేతులూ హ్యాండ్ రెస్టు మీద వేసి, పాండవులకు సూది మొన మోపినంత నేల కూడా ఇవ్వనన్న దుర్యోధనుడ్ని మించిన దురహంకారంతో సుబ్బారావు వైపు చూశాడు.

# విమానయానం



సుబ్బారావు అలానే సీట్లో ఇరుక్కున్నాడు. సీటు బెల్టు కట్టుకోకపోతే ఒకడు వచ్చి హెచ్చరించి వెళ్లాడు.

ఇంతలో ఒక ఎయిర్‌హోస్టెస్ వచ్చి ఎదురుగా నిలబడింది. విమానం నేల మీద కూలిపోతే ఏం చేయాలి, నీళ్ల మీద కూలిపోతే ఏం చెయ్యాలి? ఆక్సిజన్ మాస్కులు ఎలా తొడుక్కోవాలి? చీకట్లో విమానం నుండి ఎలా బయటపడాలి? లాంటి విషయాలను డిమాన్స్ట్రేట్ చెయ్యసాగింది.

'ఇదెక్కడి పీడాకారం... టిక్కెట్ కొనుక్కోవటానికి వెళ్తే ఇన్సూర్యెన్స్ తీసుకోమంటాడు. టిక్కెట్ కొనుక్కుని విమానం ఎక్కితే, పడిపోతే ఏం చెయ్యాలో నేర్పిస్తామంటారు. పడిపోయే గోల తప్ప వీళ్లకి ఇంకేమీ పనీ పాటా లేదా?' అని ఒకింత కోపం చేసుకున్నాడు సుబ్బారావు.

అనౌన్సుమెంటు పూర్తి చేసి వెనక్కి వెళ్లి పోయింది ఆ ఎయిర్‌హోస్టెస్.

విమానం బయలుదేరి రన్‌వే చివరికి వచ్చింది.

'దీంట్లో భయపడేది ఏముంది? బస్సులో వెళ్తున్నట్లే ఉంది..." అనుకున్నాడు సుబ్బారావు.

క్లియరెన్స్ వచ్చినట్లుంది టేకాఫ్ కోసం రెడీ అవుతోంది విమానం. ఇంజన్ శబ్దంలో ఒక్కసారిగా తేడా వచ్చింది. స్పీడు అందుకుంది. వీపు సీటుకు అంటుకుపోయే అంత వేగంతా వెళ్తోంది. సుబ్బారావు చేతులు అతనితో ప్రమేయం లేకుండానే హ్యాండ్ రెస్ట్ మీద బిగుసుకున్నాయి.

విమానం గాల్లోకి లేచింది. కిటికీలో నుండి బయటకు చూస్తే పక్కన ఉన్న భవనాలూ, చెట్లూ, అన్నీ కిందకు వెళ్లిపోతూ కనిపిస్తున్నాయి.

తను ఇప్పుడు గాల్లో ఉన్నాననుకోగానే సుబ్బారావు గుండె ఆగి కొట్టుకున్నట్లయింది.



ఇంతలో విమానం గాలిలో ఏటవాలుగా వంగి దిశ మార్చుకుంది.

కళ్లు గట్టిగా మూసుకుని పళ్లు గిట్టకరచి చేతులు హ్యాండ్ రెస్ట్ మీద మరింత బిగించాడు సుబ్బారావు.

పండుగాడు చెప్పినట్లు కిటికీలో నుండి బయటకు చూస్తూ తమ ఇంటి మీద ఉన్న వాడికి చెయ్యి ఊపాలన్న విషయం అసలు గుర్తే రాలేదు.

విమానం డబడబ శబ్దాలు చేస్తూ మధ్య మధ్యలో ఊగుతోంది.

సుబ్బారావు గుండె దడ పెరిగి పోతోంది.

ఇలా లాభం లేదని ఆంజనేయ దండకం చదువుతూ మరింత గట్టిగా



కళ్లు మూసుకున్నాడు. ఆ దండకం ప్రభావమో ఏమో కానీ అలజడి తగ్గి విమానం ప్రశాంతంగా ప్రయాణించసాగింది.

'ఏమాటకామాట చెప్పుకోవాలి. ఆంజనేయుడు పవర్‌ఫుల్ గాడే!…' తనలో తను అనుకుని ఒక కన్ను తెరచి పరిసరాలు పరిశీలించి చూశాడు.

విమానం ప్రశాంతంగా వెళ్తోంది.

గుండెల్లో ఆందోళనకి అనుకుంటా కడుపు మొత్తం కదిలినట్లయింది. ఒకసారి టాయిలెట్ దర్శనం చేసుకుంటే బాగుండనిపిస్తోంది. ఈ కిటికీ సీటు కాదు కానీ ఇప్పుడు ఆ పని చెయ్యాలంటే అందర్నీ లేపాల్సిందే. అతను ఆ ఆలోచనలో ఉండగానే కొందరు చకచకా ఏ మాత్రం బిడియ పడకుండా టాయిలెట్‌కి వెళ్లి వస్తున్నారు.



ఇక లాభం లేదని తను కూడా లేచి, "ఎక్స్క్యూజ్ మీ…" అన్నాడు.

విసుక్కుంటూ ఆ చివరి సీటతనూ, క్రూరంగా చూస్తూ సిక్కూ లేచి నిలబడ్డారు.

టాయిలెట్ దగ్గర ముందు ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు. సుబ్బారావుకి అర్జంటుగా వెళ్లవలసి వస్తోంది. అయినా అతన్ని కాదని ముందుకు వెళ్లటం మర్యాద కాదని అతన్నే ముందు వెళ్లనిచ్చాడు.

ఈలోపు ఒక ముసలాయన వచ్చి సుబ్బారావు పక్కన నిలబడ్డాడు.

టాయిలెట్ ఖాళీ కాబోతుండగా, "పెద్ద వాడ్ని కాస్త సర్దుకోవోయ్…" అంటూ ఆయన లోపలకు దూరి పోయాడు.

కాళ్లు రెండూ మెలిక వేసి ఆపసోపాలు పడుతూ టాయిలెట్ బయట నిలబడ్డ సుబ్బారావుని చూసి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఎయిర్‌హోస్టెస్‌లు ట్రాలీలు తోసుకుంటూ విమానంలోకి బయలుదేరారు.



ఎట్టకేలకు టాయిలెట్లోకి దూరి బయటకు వచ్చిన సుబ్బారావుకి నిజంగా గాల్లో తేలటం అంటే ఏమిటో అప్పుడు అవగతమయింది.

తిరిగి సీట్లో కూర్చోవటానికి మొదటిసారి లానే మిగిలిన వారు లేవవలసిన ప్రహసనం మళ్లీ జరిగింది. ఎలాగోలా సీట్లో కూర్చున్నాడో లేదో ట్రాలీ తోసుకుంటూ ఎయిర్‌హోస్టెస్ వచ్చింది.

ఏమి కావాలని అడిగిన ఆమె ప్రశ్నకి సమాధానంగా ఎదురుగా ట్రాలీ మీద కనిపిస్తున్న వస్తువుల లిస్టు మొత్తం చెప్పాడు సుబ్బారావు.

అవన్నీ ఇచ్చి మరో పది నిమిషాల తరువాత వచ్చి తొమ్మిది వందల ఎనభై బిల్లు చేతిలో పెట్టింది ఆ అమ్మాయి. ఇదేమిటన్నట్లు చూసిన సుబ్బారావుతో, “వాటర్ ఒక్కటే కాంప్లిమెంటరీ సార్! మిగిలిన వాటన్నిటికీ పే చెయ్యాలి…” అని చెప్పింది.

‘అయితే వద్దు…’ అని వెనక్కి ఇవ్వటానికి అహం అడ్డొచ్చి, బజార్లో రెండు వందలకు దొరికే ఆ సామానుకు వెయ్యి చెల్లించుకుని నీరసంగా వెనక్కి వాలాడు సుబ్బారావు.

ఇంతలో తిరిగి సీటు బెల్టులు బిగించుకోమని ఎనౌన్సుమెంటు వినిపించింది.

‘అప్పుడే ఢిల్లీ వచ్చిందా?’ అనుకుంటూ చెప్పిన పని చేశాడు సుబ్బారావు.

అప్పటికల్లా కాస్త్తైపు అలవాటవటంతో తీరిగ్గా కిటికీలో నుండి బయటకు చూశాడు సుబ్బారావు.

హైదరాబాదు వీధుల్లానే ఉన్నాయి ఢిల్లీ వీధులు కూడా! కిందకి దిగుతుంటే ఒక ఇల్లు కూడా అచ్చు తన ఇంటిలానే కనిపించింది. ఆ ఇంటి మీద నిలబడి ఒక పిల్లాడు చెయ్యి ఊపుతున్నాడు కూడా!

‘గ్లోబల్ విలేజ్ అంటే ఇదేనేమో! హైదరాబాదయినా, ఢిల్లీ అయినా తేడానే కనిపించటం లేదు…’ అనుకుంటున్న అతని పాజిటివ్ దృక్పథానికి తూట్లు పొడుస్తూ ఎనౌన్సుమెంటు వినిపించింది.

సాంకేతిక కారణాల వలన విమానం తిరిగి హైదరాబాదులో ల్యాండ్ అవుతోందనీ, అది తిరిగి ఎప్పుడు ఢిల్లీ బయలుదేరుతుందో ఇప్పుడప్పుడే చెప్పలేమనీ వినిపిస్తున్న ఆ ఎనౌన్సుమెంటును విని గాఢంగా నిట్టూర్చాడు సుబ్బారావు.

సమాప్తం